క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పహాడీషరీఫ్ ఏఈ అఫ్సర్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్‌పల్లి, మామిడిపల్లి, శ్రీరాం కాలనీ, రిలయన్స్ కాలనీ, బృందావన్ కాలనీ, జల్‌పల్లి చెరువు కట్ట, నూరీనగర్, గౌస్ నగర్, అహ్మద్ నగర్, ఇస్మాయిల్ నగర్ తదితర ప్రాంతాల్లో ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

చెట్లకొమ్మల తొలగింపు కారణంగా..

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె. రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పెద్ద అంబర్‌పేట, లక్ష్మారెడ్డిపాలెం, పెద్దఅంబర్‌పేట టౌన్, కొహెడ, పసుమాముల, తారామతిపేట, కుంట్లూర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ పోస్టాఫీసు ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేడు 'మన ఊరు–మన బడి' ప్రారంభం

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి



భోజనాన్ని పరిశీలిస్తున్న జంగారెడ్డి

కందుకూరు: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాచులూరు ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న పనులను జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి మంగళవారం పర్యవేక్షించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఈ పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంలాగా మారింది. దీంతో మంగళవారం అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు ఆలయం వద్ద క్యూ కట్టారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు, పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాం

- సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల ఆవేదన
- సభను బాయ్‌కాట్ చేసి నిరసన

కడ్తాల్: రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ఎంపీటీసీలం.. విధులు, నిధులు, తగిన గౌరవం లేక ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ దశరత్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీడీఓ రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభ ప్రారంభం కాగానే కర్కల్‌పహాడ్ ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీటీసీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిన్నచూపు చూడటాన్ని నిరసిస్తూ సభను బాయ్‌కాట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంపీటీసీల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని అన్నారు. నిధులు, విధులు, అధికారాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వార్డు సభ్యులకు ఉన్న గౌరవం ఎంపీటీసీ సభ్యులకు లేకుండా పోయిందని.. కనీసం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా సీటు కూడా లేదని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయాల్సిన గ్రాంట్స్ కూడా విడుదలకావడం లేదని వాపోయారు. మండల పరిషత్ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, రాములుగౌడ్, మంజుల, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా తదితరులు ఉన్నారు.

ఫోన్‌తోనే విద్యుత్ మీటర్ రీడింగ్

విద్యుత్ మీటర్ రీడింగ్ ఫోన్ నుంచే తెలుసుకోవచ్చు. బిల్లింగ్ కోసం టీఎస్ఎస్‌పీడీసీఎల్ నూతన విధానం అమలులోకి తీసుకువచ్చింది. సెల్‌ఫోన్‌తో మీటర్ రీడింగ్‌ని స్కాన్ చేసి.. బిల్లు తీసుకునే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

- నిమిషాల్లో బిల్లింగ్.. వెంటనే అప్‌డేట్
- విద్యుత్ సిబ్బందికి తీరనున్న తిప్పలు



ఫోన్‌తో మీటర్ రీడింగ్ తీస్తున్న విద్యుత్ సిబ్బంది

మహేశ్వరం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికత వైపు విద్యుత్ శాఖ అడుగులు వేస్తుంది. ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌లతో పాటు ఫోన్‌లోని యాప్ నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించే విధానం అమల్లోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం అదే ఫోన్ ద్వారా మీటర్‌ను స్కాన్ చేయడంతో రీడింగ్ తీసే విధానం అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం అన్ని మండలాల్లో ఈ విధానం అమలు చేస్తున్నారు.

అప్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు

గతంలో విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ మీటర్ రీడింగ్ పుస్తకంలో రాసుకుని వారం తర్వాత వినియోగదారుడికి బిల్లు ఇచ్చేవారు. ఈ విధానం వినియోగదారులకు, సంస్థకు ప్రయోజనకరంగా లేకపోవడంతో స్పాట్ బిల్లింగ్ యంత్రాలను ప్రవేశపెట్టి ఇంటి వద్దే బిల్లు తీసి ఇచ్చేవారు. ఇందులో కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయి. యంత్రంలో బిల్లు నమోదైన అనంతరం దాన్ని కంప్యూటర్‌కు అనుసంధానించి సర్వర్‌లో అప్‌లోడ్ చేసే వారు. దీనికి మూడు రోజుల సమయం పట్టేది. అప్‌లోడ్ సమయంలో సాంకేతిక సమస్యల కారణంగా కొన్ని సర్వీసులకు సంబంధించి బిల్లులు హెచ్చుతగ్గులుగా నమోదవ్వడం, తదితర సమస్యలు ఉత్పన్నమయ్యేవి. యంత్రాలు మరమ్మతులకు గురైతే రోజుల తరబడి రీడింగ్‌కు సిబ్బంది రాని పరిస్థితి ఉంటుంది.

స్కాన్.. ఫొటో.. ప్రింట్

విద్యుత్ సిబ్బంది ఉపయోగించే ఫోన్‌తోనే విద్యుత్ మీటర్ రీడింగ్ తీయనున్నారు. ఉద్యోగికి యూజర్ ఐడీతో పాటు ప్రత్యేకంగా పాస్‌వర్డ్ కేటాయించారు. ఫోన్‌లో నమోదైన రీడింగ్ ప్రింటింగ్ తీయడానికి ప్రత్యేక యంత్రాన్ని సమకూర్చనున్నారు. మీటర్ వద్దకు ఫోన్ తీసుకెళ్లగానే మీటర్ రీడింగ్ నమోదవుతుంది. అదే సమయంలో ఫొటో తీస్తుంది. వెనువెంటనే బిల్లు మొత్తం ప్రింటర్ నుంచి చీటి రూపంలో వస్తుంది. ఫోన్ నుంచి విద్యుత్ సంస్థ సర్వర్‌కు నేరుగా కనెక్టయి అప్‌లోడ్ అవుతుంది. ఇదంతా నిమిషం వ్యవధిలోనే పూర్తవుతుంది.

పారదర్శకంగా బిల్లింగ్



ఫోన్ ద్వారా విద్యుత్ మీటర్ రీడింగ్ తెలుసుకొని బిల్లులు చెల్లించే విధానం డివిజన్, మండలాల్లో అమలు చేస్తున్నాం. ఈ విధానం సౌకర్యవంతంగా ఉండడంతో పాటు వినియోగదారులకు పారదర్శకమైన వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. దీంతో బిలులో ఎలాంటి హెచ్చు తగ్గులు, తప్పులు జరగవు

– ఎం.సుధాకర్‌రెడ్డి, విద్యుత్ ఏఈ, మహేశ్వరం

హరినాయక్‌కు నివాళి..

సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మృతి చెందిన విక్టోరియా మెమోరియల్ హోం విద్యార్థి హరినాయక్‌కు ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, పున్న గణేశ్‌నేత, బీజేపీ నాయకులు ఆరుట్ల సురేశ్ కుమార్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

– హుడాకాంప్లెక్స్



రిటైర్డ్ ఉద్యోగికి ఘన సన్మానం



దామోదర్‌ను సన్మానిస్తున్న సర్దార్ పటేల్ యువజన సంఘం సభ్యులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సర్దార్‌పటేల్ యువజన సంఘం వ్యవస్థాపకుడు నోముల దామోదర్ ఇటీవల ఆర్టీసీ ఉద్యోగిగా పదవీవిరమణ పొందారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సన్మాన సభలో సర్దార్‌పటేల్ యువజన సంఘం సభ్యులు దామోదర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వై.శివకుమార్ మాట్లాడుతూ.. దామోదర్ ఉద్యోగ బాధ్యతలతో పాటు, రావిర్యాలలో యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రజాసేవ చేస్తూ యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు పాలమోని సీయోధన్, సభ్యులు రవీందర్, చిన్న నర్సింహ, దర్శన్, లింగమయ్య, భిక్షపతి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కందుకూరు: అంతర్జాతీయ తృణ ధాన్యాల సంవత్సరం–2023ను పురస్కరించుకుని మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరు ధాన్యాల పంటల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ పి.యాదగిరి మాట్లాడుతూ.. చిరు ధాన్యాలు వరి, గోధుమల కంటే ఐదు రెట్లు ఎక్కువగా పోషక విలువలు, మినరల్స్, విటమిన్స్ అధికంగా ఉంటాయన్నారు. ప్రజలు రోజు వారీ ఆహారంలో తీసుకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. చిరుధాన్యాలు పండించుకుంటే పోషకాహారంతో పాటు ఆహార భద్రత లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌర ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యురాలు రేఖాబాబురావు, ఏఈఓ అర్చన, రైతులు పాల్గొన్నారు.

పన్నులు, నల్లాబిల్లులు తగ్గించండి

కమిషనర్‌కు విన్నవించిన కార్పొరేటర్లు



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని పేదలు నివాసముండే వీకర్‌సెక్షన్ కాలనీలలో ఇంటి పన్నులు, నల్లా బిల్లులు తగ్గించాలని కౌన్సిలర్లు కోరారు. ఈమేరకు 33వ డివిజన్ కార్పొరేటర్ ఏ.భీంరాజ్ సహచర కార్పొరేటర్లతో కలిసి మంగళవారం కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక పన్నులు, నల్లా బిల్లులతో పేదలపై భారం పడుతోందని, వెంటనే తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ప్రజలతో కలిసి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భిక్షపతిచారి, హరినాథ్‌రెడ్డి ఉన్నారు.

న్యాయం చేయాలని రైతు..

మీర్‌పేట సర్వే నెం–61లోని భూమిలో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని, తమకు న్యాయం చేయాలని మీర్‌పేటకు చెందిన దాసరి బాబు, కుటుంబ సభ్యులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తాము సాగు చేసుకుంటున్న భూమిలో చేపడుతున్న నిర్మాణంపై ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో బ్యాంకు నుంచి రుణం పొంది ఈ స్థలంలో బావిని తవ్వి వ్యవసాయం చేశామని, తమ భూమి తమకే దక్కేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

శవరాజకీయాలు చేయడం సరికాదు

బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి వీఎం హోం పాఠశాలలో నాలుగు రోజుల క్రితం అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి మృతిపై శవ రాజకీయం చేయడం తగదని బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. మంగళవారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శులు అరవింద్ శర్మ, బేర బాలకిషన్ మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి పైన సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శవ రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థి మృతిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. కార్పొరేటర్‌గా గెలిచి రెండేళ్లు అవుతున్నా సరూర్‌నగర్‌లో ఆమె చేసిన అభివృద్ధి శూన్యమని, భవిష్యత్‌లో మంత్రిపై అవాకులు, చెవాకులు పేలితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సమావేశంలో సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల అధ్యక్షులు మహేందర్ యాదవ్, పెండ్యాల నగేశ్, సీనియర్ నాయకులు దయాకర్‌రెడ్డి, రాఘువేందర్ గుప్తా, సలీం, జహీర్ పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

ఎన్‌వైకే కో ఆర్డినేటర్ శివకుమార్



అవగాహన కల్పిస్తున్న శివకుమార్

మహేశ్వరం: అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమని నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) మహేశ్వరం బ్లాక్ కో ఆర్డినేటర్ ముయ్యాడ శివకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీసీ కాలేజ్ హాస్టల్‌లో ఎన్‌వైకే ఆధ్వర్యంలో లైంగిక వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో హెచ్‌ఐవీపై సంపూర్ణ అవగాహన కల్పిస్తేనే ఎయిడ్స్ వ్యాధిని నివారించగలమన్నారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు ఉపయోగకరమైన వైరల్ లోడ్ మిషన్ రిమ్స్‌లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ మిషన్ ద్వారా శరీరంలో హెచ్‌ఐవి వైరస్ తీవ్రతను గుర్తించి అందుకు అనుగుణంగా తగిన మోతాదులో మందులను వాడవచ్చు. హెచ్‌ఐవీ సోకకుండా జాగ్రత్తలు, నిర్మూలన, నియంత్రణపై యువతలో ఎక్కువ ప్రచారం చేయాలన్నారు. అసురక్షిత లైంగిక సంబంధాల వల్లే ఈవ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రధానంగా గ్రామాలు, తండాలు, బస్తీలు, వీధుల్లో యువజన సంఘాలు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు.

బీజేపీ ఆరోపణలు అవాస్తవం

డిప్యూటీ మేయర్ శేఖర్



మాట్లాడుతున్న శేఖర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ అభివృద్ధి మేయర్, డిప్యూటీ మేయర్ వల్లనే ఆగిపోయిందని బీజేపీ నేతలు చేసిన వాఖ్యలను డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ కొట్టిపారేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సమాజంలో పేదలకోసం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం పనిచేస్తున్న శేఖర్‌ను గుర్తించి మంత్రి సబితారెడ్డి డిప్యూటీ మేయర్‌గా అవకాశం ఇచ్చారన్నారు. నాదర్‌గుల్‌లో బీజేపీ కార్పొరేటర్లు పెట్టిన ప్రెస్‌మీట్‌లో అగ్రవర్ణాలు, బలహీన వర్గాలనుంచి మాట్లాడించారే తప్ప 20 ఏళ్ల రాజకీయ అనుభవంతో గెలిచిన నాదర్‌గుల్ దళిత కార్పొరేటర్ ఇంద్రసేనాను ఎందుకు మాట్లాడించలేదని ప్రశ్నించారు. బీజేపీ కార్పొరేటర్లు చేస్తున్న ఆరోపణల్లలో వాస్తవం లేదన్నారు. బీజేపీ కులపక్ష పార్టీ అని విమర్శించారు. తాను దళితుడినే డిప్యూటీ మేయర్ పదవినుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. లోపాయికారి ఒప్పందం మేయర్‌కు బీజేపీకి ఉందని తేటతెల్లం అన్నారు. మేయర్ అధికార పార్టీలో ఉండి దమ్మిడిగా పనులు తీసుకుని మేయర్ పారిజాత పార్టీ మారిన వెంటనే విమర్శించడం సరికాదని హితవు పలికారు. విలువలు పెంచే రాజకీయాలు చేయా లని బీజేపీ కార్పొరేటర్లకు సూచించారు. 15 మంది ఉన్న బీఆర్ఎస్, ఏడుగురు కార్పొరేటర్లు ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లను 10 సీట్లు ఉన్న బీజేపీ కార్పొరేటర్లు పిలిస్తే పరుగెత్తుకు రావాలా అని ప్రశ్నించారు. తాను ఎల్లప్పుడు సమాజ బాగు కోసం పోరాడుతానని తెలిపారు. కార్యక్రమంలో బాబురావు, నర్సింగ్‌రావు, రజినీకాంత్, శ్రీను, ఎల్లేశ్ ఉన్నారు.

అనుమతి లేకుండా సమావేశం

సీపీఎం నాయకుల అరెస్ట్

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కుంట్లూర్ పాపయ్యగూడలో ఇటీవల పేదలు గుడిసెలు వేసిన విషయమై ఎలా ముందుకు వెళ్లాలో చర్చించేందుకు సమీపంలోని తట్టిఅన్నారంలో సమావేశమైన సీపీఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. సీపీఎం జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం... పేదలకు ఇళ్ల స్థలాలు, ఇవ్వాలని, అర్బన్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ నిషేధాన్ని ఎత్తివేయాలనే డిమాండ్‌తో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించాలని సీపీఎం నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలో సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని సమావేశాన్ని చుట్టుముట్టారు. పోలీసుల రాకతో అక్కడివారు ఆందోళనకు గురయ్యారు. అనుమతి లేకుండా సమావేశం నిర్వహిస్తున్నారనే కారణంగా పోలీసులు నాయకులు నర్సింహతో పాటు మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, బీఎస్పీ నాయకులు రవికుమార్, సౌజన్యను అదుపులోకి తీసుకుని హయత్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎల్‌ఓసీ అందజేత

తుర్కయంజాల్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనేదే ప్రభుత్వ ఉద్దేశం అని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్‌కు చెందిన ఎస్.వెంకటేష్‌కు రూ.1.25 లక్షల ఎల్‌ఓసీని మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు రమేష్‌గౌడ్, నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ నిమిత్తం..

కడ్తాల్: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన కడారి మంగమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆపరేషన్ నిమిత్తం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లగా.. సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3.40 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే మంజూరు చేయించి మంగళవారం అందజేశారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఎంపీటీసీ కుమార్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సత్యం, నాయకులు రమేశ్, ప్రసాద్ ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

కడ్తాల్: ఆమనగల్లు పట్టణానికి చెందిన కావటి లక్ష్మయ్యకు చెందిన వ్యవసాయ పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ఉదయం గడ్డివాముకు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది.రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

గొర్రెలకు బదులు నగదు ఇవ్వండి

జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం



కందుకూరులో సమావేశమైన జీఎంపీఎస్ నాయకులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ చేపట్టాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీకి బదులుగా నగదు బదిలీ చేయాలని డిమాండ్‌తో ఫిబ్రవరి 3న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. కాపరులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు ఎ.పాలేశ్, ఉపాధ్యక్షుడు చెంచు అంజయ్య, కోశాధికారి చిందం అంజయ్య, సహాయ కార్యదర్శి దొడ్డి కృష్ణ, సభ్యులు చిట్టె బాలకృష్ణ, డి.శేఖర్, బండ రాజు, ఎ.నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాధి



డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్మన్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని చైర్మన్ అబ్దుల్లా సాధి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు మెట్రో సిటీలో రూ.17లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన కౌన్సిలర్ అహ్మద్ కసాధితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3వ వార్డు పరిధిలో నెలకొన్న ముంపు సమస్య పరిష్కారం కోసం రూ.10 కోట్ల వ్యయంతో డ్రెయిన్ బాక్స్ నిర్మించామన్నారు. అన్ని బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. మంత్రి సబితారెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీల సహకారంతో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పట్టాలివ్వండి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

యాచారం: నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,400 ఎకరాల భూముల్లో కౌలు చేసుకుంటున్న రక్షిత కౌలు రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయ పేరును రద్దు చేసి రైతులకు పట్టాలు అందజేయాలని కోరారు. ఓంకారేశ్వరాలయ భూముల్లో 60 ఏళ్లకు పైగా నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 600 మంది రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. చట్ట ప్రకారం వారికి 1950లోనే 37–ఏ సర్టిఫికెట్ వచ్చినట్లు తెలిపారు. రైతులకు పట్టాలు ఇవ్వకుండా అధికారులు 1953లో ఓంకారేశ్వరాలయం పేరుమీద 1,400 ఎకరాల భూములున్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారని అన్నారు. నాటినుంచి నేటి వరకు కౌలు రైతులు ఆ భూములనే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ఆలయ భూమిని యోగ్యంగా మార్చుకోవడం కోసం కౌలు రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ జరిపి కౌలు రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కె.భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, ప్రజాసంఘాల నాయకులు పి.యాదయ్య, బి.సామేల్, డి.జగదీష్, ఆలంపల్లి నర్సింహ, పాల్గొన్నారు.